## 'గౌడ కులస్తులకు అండగా నిలిచింది కేసీఆర్ మాత్రమే'


సర్వాయి పాపన్న విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగి రమేష్

పెనుబల్లి, మే 18: గౌడ కులస్తులకు అండగా నిలిచిందని కేసీఆర్ మాత్రమేనని ఏపీ మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆదివారం వీ.ఎం.బంజరలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ ఆశయాలకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ఆయన సేవలను అందరికీ తెలిసేలా గ్రామగ్రామాన తెలపాలన్నారు. కేసీఆర్ గౌడ కులస్తులకు అండగా నిలిచారని, హైదరాబాద్‌లో వంద కోట్లతో భవన నిర్మాణానికి కృషి చేశారని, గీత కార్మికులకు పింఛన్ పెంచారని, నీరా స్టాల్స్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. ఏ క్షణంలోనైనా గౌడ కులస్తుల సహాయార్థం తక్షణమే స్పందిస్తానని, అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు వేముల నరసింహారావు, చలమాల విఠల్, చీపు శ్రీను, వజ్జూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి జోగి రమేష్ అనుచరుడు చింతా అనిల్, వజ్జూరి గోపి, వంగా గిరిజాపతి పాల్గొన్నారు.

## పాతబస్తీ ప్రమాదం దిగ్భ్రాంతికరం

**బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి: మాజీ ఎంపీ నామా**

ఖమ్మం, మే 18: హైదరాబాద్ పాతబస్తీలో ఆదివారం ఉదయం చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. ఈ ఘటన దురదృష్టకరమంటూ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనలో 17 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు చెప్పారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వారు త్వరగా కోలుకోవాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, క్షతగాత్రులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచి సీపీఎంలో చేరికలు

ఎర్రుపాలెం, మే 18: కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. ఆదివారం మండలంలోని భీమవరం గ్రామంలో వివిధ పార్టీల నుంచి సీపీఎం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, మడుపల్లి గోపాలరావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## మాలల హక్కుల కోసం పోరాడుదాం..


మాట్లాడుతున్న యూనిటీ ఆఫ్ మాల సంఘం నాయకులు

వైరాటౌన్, మే 18: మాలల హక్కుల కోసం పోరాడదామని యూనిటీ ఆఫ్ మాల పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్ అన్నారు. యూనిటీ ఆఫ్ మాల ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 8న ప్రతి మండలంలో పట్టణ ప్రాంతాల్లో విధిగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని, మాలల హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మద్దెల రవి, ఫణితి సైదులు, నాగబత్తిని రమేష్, తుమ్మల చిన్ని, గారపాటి అశోక్ రాజు, రాయపూడి శ్రీను, ముక్త మాలకృష్ణ, గుత్తికొండ వీరబాబు, కందుల అర్జున్‌రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

వేంసూరు, మే 18: మండంలోని కందుకూరు, భరణిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆయా సహకార కేంద్రం పరిధిలోని రైతులకు 50 శాతం రాయితీపై జీలుగులు ఎమ్మెల్యే మట్టా రాగమయి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పీ.రామ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు 150, భరణిపాడు 150, వేంసూరు 200, అమ్మపాలెం 100, కే.జీ.మల్లెల 250, పల్లెవాడ 200, లచ్చన్నగూడెం 150 క్వింటాళ్ల జీలుగులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు నకళ్లు తీసుకొని ఆయా సహకార కేంద్రాలకు రావాలని కోరారు. జీలుగు 30 కిలోల బస్తా ధర రూ.427 రాయితీ రూ.2137.50 రైతు వాటా రూ.2137.50 అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ..
## ధాన్యం కొనుగోళ్లపై లేదు

**రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరాటౌన్, మే18: రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీల నిర్వహణపై ఉన్న శ్రద్ధ ధాన్యం కొనుగోళ్లపై లేకపోవడం దురదృష్టకరమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో జరిగిన తెలంగాణ రైతు సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస ఏర్పాట్లు చేయలేదని, రోజుల తరబడి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండాల్సిన పరిస్థితులు కల్పించిందని ఆరోపించారు. కార్యక్రమంలో చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, హరి వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, శివాజి తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# అంధకారంలో 'వేపకుంట్ల'

- ఎనిమిది నెలలుగా వెలగని వీధిలైట్లు
- హైమాస్ట్ లైట్లదీ అదే పరిస్థితి


వేపకుంట్లలో ఎనిమిది నెలలుగా వెలగని హైమాస్ట్ లైట్లు

రఘునాథపాలెం, మే 18 : వీధిదీపాల పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రయితే ఆ గ్రామంలో అంధకారం అలుముకుంటోంది. పంచాయతీకి పాలకవర్గం లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి గ్రామస్తులది. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో గ్రామ కార్యదర్శి సైతం ఏమి చేయలేని పరిస్థితి. ఫలితంగా ఎనిమిది నెలలుగా రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో రాత్రిళ్లు అంధకారం నెలకొంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంకనే గ్రామానికి ఈ పరిస్థితి దాపురించిందని, పారిశుధ్యం నిర్వహణ పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని గ్రామస్తులు వాపోతున్నారు. ఊర్లో ఉంటున్నామో..? అడవిలో ఉంటున్నామో తెలియడం లేదంటూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. సుదూర ప్రాంతాల గ్రామాల దుస్థితి ఇంకెలా ఉంటుందోననే ఆశ్చర్యపోతున్నారు. వేపకుంట్లలో ఎనిమిది నెలలుగా వీధిలైట్లు వెలగకపోవడంతో గ్రామస్తులు రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదదీస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. మా గ్రామానికి చీకట్లను తెచ్చిందని వాపోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సుడా నిధులతో రూ.లక్షలు వెచ్చించి ప్రధాన కూడళ్లలో పెట్టిన హైమాస్ట్ లైట్ల నిర్వహణను సర్కార్ పట్టించుకోకపోవడంతో గ్రామం మొత్తం అంధకారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బాధిత కుటుంబాలకు సండ్ర పరామర్శ


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సండ్ర

పెనుబల్లి, మే 18: మండల పరిధిలోని లంకపల్లి గ్రామానికి చెందిన తెల్లగొర్ల జనార్దన్ మాతృమూర్తి లక్ష్మీకాంతమ్మ ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. జనార్దన్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, చిలుకూరి వెంకటరామారావు, గాయం రామారావు, బీ.వెంకటేశ్వరరావు, బీ.వీ.కర్రిరామారావు తదితరులు ఉన్నారు.

**మామిళ్లపల్లి మృతికి నివాళి**

సత్తుపల్లి, మే 18: మండల పరిధిలోని కిష్టారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సొసైటీ చైర్మన్ మామిళ్లపల్లి కృష్ణయ్య శనివారం ఉదయం హైదరాబాద్‌లో మృతిచెందాడు. ఆదివారం కిష్టారంలోని ఆయన స్వగ్రామానికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు దొడ్డా శంకర్‌రావు, పర్వతనేని వేణు, మాచినేని నరేంద్ర, జవ్వాజి అప్పారావు, కొడిమకల అప్పారావు, నరుకుళ్ల రాధాకృష్ణ, కూసంపూడి మధు, మోరంపూడి శ్రీధర్, చింతమనేని సత్యానారాయణ, కృష్ణ, కొల్లపనేని అశోక్, రాజు ఉన్నారు.

**హనుమాన్ జయంతికి సండ్రకు ఆహ్వానం**

సత్తుపల్లిటౌన్, మే 18: సత్తుపల్లి పట్టణంలోని వేంసూరు రోడ్డు కొత్తూరు గ్రామంలోని కోదండ సీతారామలక్ష్మణ్ సమేత మెట్ట ఆంజనేయస్వామి వారి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహిస్తున్న హనుమాన్ జయంతి వేడుకలకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాలాన్ని కాంతారావు, సెక్రటరీ మందపాటి రవీంద్రరెడ్డి, కోశాధికారి మల్లూరి అంకంరాజు, కార్యవర్గ సభ్యులు మద్దు వెంకటరమణ, సాదు శివ, అల్లాడి రాము, గోగినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి సాయం


తిరుమలాయపాలెం: సాయం అందిస్తున్న ఉపేందర్ రెడ్డి

తిరుమలాయపాలెం, మే 18: మండలంలోని రాజారం గ్రామానికి చెందిన నిరుపేదరాలు గుర్రాల పార్వతమ్మ.. తీవ్ర అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. ఆమె అంత్యక్రియల కోసం కుటుంబీకులకు బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల ఉపేందర్‌రెడ్డి రూ.పదివేలు ఇచ్చారు.

ఖమ్మం రూరల్, మే 18: ఖమ్మం 59వ డివిజన్‌లోని దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన ఏగురి సల్మాన్‌రాజు.. అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. మృతదేహాన్ని బీఆర్ఎస్ డివిజన్ నాయకుడు దామాల రవి సందర్శించి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.5వేలు అందించారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరాటౌన్, మే 18: ఈ నెల 24న వైరా నియోజకవర్గ కేంద్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసం నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలో మచ్చా బుజ్జి పామాయిల్ తోటనందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సారథ్యంలో సింగరేణి సంస్థ సహకారంతో వైరా నియోజకవర్గ కేంద్రంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, మంగీలాల్ నాయక్, స్వర్ణ నరేందర్ పాల్గొన్నారు.

## జిల్లాలో ముగ్గురు తహసీల్దార్ల బదిలీ

రఘునాథపాలెం, మే 18 : జిల్లాలో పలు మండలాల్లో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వి.రవికుమార్ కూసుమంచి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన డీ సైదులును నియమించారు. కూసుమంచిలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న డి.కరుణశ్రీని ఖమ్మం అడిషనల్ కలెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అండర్ సస్పెన్షన్‌లో ఉన్న షా ఖాసీంను కొణిజర్ల తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉచిత వైద్య శిబిరం

కూసుమంచి (నేలకొండపల్లి), మే 18: నేలకొండపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నూతక్కి గంగాధర్ రావు ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. దీనిని న్యాయవాది కొల్లు సత్యనారాయణ ప్రారంభించారు. డాక్టర్ ఏటుకూరి రామారావు తదితరులు వైద్య సేవలందించారు. ఐలమ్మ ట్రస్ట్ చైర్మన్ బుగ్గవీటి సరళ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ గాలం..

- ఇంటింటికీ తిరుగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు
- నాణ్యమైన విద్యనందిస్తామంటూ ఆర్భాటాలు
- ఫీజుల పేరుతో నిలువుదోపిడీ
- అర్హత లేని వారితో విద్యాబోధన
- ర్యాంకుల ఆశ చూపుతూ జోరుగా ప్రచారం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మే 18 : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఖరీదైన కార్పొరేట్ విద్యావ్యవస్థను ఇంటింటికీ చేర్చేందుకు విద్యార్థులకు గాలం వేస్తున్నాయి. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఇప్పటినుంచే విద్యార్థుల తల్లిదండ్రులను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. టార్గెట్లు పూర్తి చేయడానికి తమ విద్యాసంస్థలో పనిచేసే ఉపాధ్యాయులు, లెక్చరర్లను విద్యార్థుల ఇండ్ల చుట్టూ తిప్పుతున్నారు. నాణ్యమైన విద్యను అందిస్తామని మాయమాటలు చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆయా కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో తమ స్థాయికి మించి ఖర్చు చేసి చేర్పించినప్పటికీ ఆ విద్యాసంస్థల్లో అర్హత లేని బోధకులతో విద్యాబోధన చేయడం వల్ల తల్లిదండ్రుల ఆశలు నిరాశగానే మిగులుతున్నాయి. ర్యాంకుల ఆశ చూపి ఫీజుల దోపిడీకి కార్పొరేట్ విద్యాసంస్థలు రెడ్ కార్పెట్ పలుకుతున్నాయి. నర్సరీ పిల్లలకు సైతం వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ తమ పాఠశాలల్లోనే అత్యధిక రేటు పుస్తకాలు, యూనిఫాంను విక్రయిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గడిచిన ఏడాది ఓ కార్పొరేట్ సంబంధించిన పాఠశాలల్లో టెక్నో పేరుతో సుమారు రూ.5 వేలకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు అంటగట్టి కనీసం ఆ పుస్తకాలను ఓపెన్ చేసిన పాపాన సైతం పోకపోవడం గమనార్హం.

**ప్రచారంలో వెనుకబడిన ప్రభుత్వ విద్యాసంస్థలు..**

నాణ్యమైన విద్యావ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వ విద్యాసంస్థలు తమ శాయశక్తులా కృషి చేస్తున్నప్పటికీ ప్రచారంలో మాత్రం వెనుకబడే ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలల వసతిగృహాల్లో అన్నిరకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందడం, ప్రభుత్వ విద్యాసంస్థలపై తల్లిదండ్రులకు నమ్మకం లేకపోవడంతో ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీ పడలేకపోతున్నాయి.

### ఫీజుల దందా..

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణలో విద్యాశాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో దందా జోరుగా నడుస్తున్నది. పాఠశాలల నోటీస్ బోర్డుల్లో ఫీజుల వివరాలను ప్రకటించాల్సి ఉండగా ఏ ఒక్క పాఠశాల సైతం ఫీజుల వివరాలు ప్రకటించకుండా విద్యార్థుల తల్లిదండ్రులను అధిక ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుమతులు అంతంతమాత్రమే ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు సరైన పద్ధతిని అవలంబిస్తే సగానికిపైగా పాఠశాలలకు అనుమతులు రాని పరిస్థితులు ఉన్నాయి. పాఠశాలలకు అతి సమీపంలోనే కార్పొరేట్ పాఠశాలలు ఏర్పాటు చేయడం గమనార్హం.

### నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు



ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠినచర్యలు తప్పవు. అనుమతులు లేని ప్రైవేట్ విద్యాసంస్థలపై నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టమైన దిశగా నడిపేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుంది.. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేరాలి.

**– వెంకటేశ్వరచారి, డీఈవో, భద్రాద్రి కొత్తగూడెం**

## తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

తల్లాడ, మే 18: తల్లాడ లయన్స్‌క్లబ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడూరు నాగేశ్వరరావు, సెక్రటరీగా నంబూరి కనకదుర్గాప్రసాద్, ట్రెజరర్‌గా అనుమోలు సర్వేశ్వరరావు, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నాటి లక్ష్మారెడ్డి, దారా శ్రీనివాసరావు, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, బెల్లంకొండ ఆంజనేయులు, శీలం వెంకటరెడ్డి, మారెళ్ల వెంకటేశ్వరరావు, నున్న చిన్నతిరుమలరావు, మురళీ, పొట్టేటి అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సుందరయ్య వర్ధంతి

**హాజరుకానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, జాన్‌వెస్లీ**

తల్లాడ, మే 18: మండల పరిధిలోని కుర్నవల్లిలో పార్లమెంట్ తొలి ప్రతిపక్ష నేత, సీపీఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సోమవారం నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర, జిల్లా డివిజన్ నాయకులు పాల్గొంటారని, కార్యక్రమంలో సీపీఎం సానుభూతిపరులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రవేశాలు



కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్

సత్తుపల్లిటౌన్, మే 18: తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాల కోసం పేద ముస్లిం మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.వెంకటరామయ్య ఆదివారం తెలిపారు. సత్తుపల్లి వెంగళ్రావునగర్‌లో ఉన్న మసీదునందు ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య, వసతి భోజన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కమ్యూనిటీ హాల్ స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న హైదరాబాద్ బిల్డింగ్ ఇంజినీర్లు

రఘునాథపాలెం, మే 18 : మండల కేంద్రం రఘునాథపాలెంలో గౌడ కులస్తులకు కమ్యునిటీ హాల్ నిర్మాణం నిమిత్తం కేటాయించిన స్థలాన్ని ఆదివారం హైదరాబాద్‌కు చెందిన బిల్డర్స్ ఇంజినీర్లు పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ మ్యాప్‌తో వచ్చిన ఇంజినీర్లు జూన్‌లో భవన నిర్మాణ శంకుస్థాపన పనులకు పలువురు మంత్రులు హాజరుకానున్నట్లు తెలిపారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో గౌడ సంఘం నాయకులు రాష్ట్ర గౌడ సంఘం సలహాదారు బొల్లికొండ దర్గయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కత్తి నెహ్రూగౌడ్, మార్కం లింగయ్యగౌడ్, ఈసీ మెంబర్ పామర్తి నాగేశ్వరారవు, పోతగాని వెంకన్న, బోడపట్ల నాగేశ్వరరావు, సుదర్శన్ ఉన్నారు.

## విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను తొలగించండి


మధిర విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ ఏడీఈ అనురాధ

మధిర, మే 18: మధిర పట్టణంలో విద్యుత్ స్తంభాలకు కరెంట్ తీగలకు సమాంతరంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తక్షణమే తొలగించాలని మధిర విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ ఏడీఈ అనురాధ తెలిపారు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగల కింద ఈ కేబుల్ వైర్లను ఏర్పాటు చేయడం వల్ల నిత్యం స్తంభాలెక్కి విధులు నిర్వహించే క్రమంలో స్తంభాలపై ఉన్న కేబుల్‌వైర్లతో పూర్తి అసౌకర్యంగా మారి సిబ్బంది ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. తక్షణమే కేబుల్ నెట్‌వర్క్స్ యాజమాన్యం, టీవీ కేబుల్ వైర్లను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. కేబుల్ యాజమాన్యాలు 24 గంటల్లో తొలగించని ఎడల ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విద్యుత్‌శాఖ సిబ్బందిచేత తొలగిస్తామని హెచ్చరించారు.

## ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

ఖమ్మం అర్బన్, మే 18 : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఖమ్మం జిల్లాలో ఆరు కేంద్రాల్లో పరీక్షను రెండు సెషన్‌ల్లో నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించారు. విద్యార్థులను గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతించారు. ఇంజినీరింగ్ కళాశాలలను కేంద్రాలుగా పరీక్ష నిర్వహించారు.

## మున్నేరు-పాలేరు లింక్ కెనాల్‌కు నిధులు విడుదల

ఖమ్మం రూరల్, మే 18: మున్నేరు వాగు వరద నీటిని గ్రావిటి కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించేలా మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54 కోట్లు విడుదల చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వృథాగా పోతున్న వరద నీటిలో సుమారు 10 టీఎంసీల నీటిని పాలేరుకు మళ్లించవచ్చని పేర్కొన్నారు. ఫలితంగా, రిజరాయర్ పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, ఇందులో ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాలు ఉంటుందని వివరించారు.

## యువకుడి ఆత్మహత్యాయత్నం

తిరుమలాయపాలెం, మే 18: మండలంలోని ఎర్రగడ్డలో యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఎర్రగడ్డ గ్రామస్తుడు నల్లమల నీరబ్‌కుమార్ ఇంట్లో ఇటీవల దొంగతనం జరిగింది. దర్యాప్తులో భాగంగా ఆ గ్రామానికి చెందిన కొందరిని పోలీసులు పిలిపించి విచారిస్తున్నారు. ఈ గ్రామస్తుడైన దామళ్ల సందీప్.. తాను చోరీ చేసినట్లుగా పోలీసుల విచారణలో అంగీకరించాడు. చోరీ చేసిన జత చెవు దిద్దులను పోలీసులకు అప్పగించాడు. బంగారపు నెక్లెస్‌ను కూడా చోరీ చేసినట్లు, దానిని ఎర్రగడ్డకు చెందిన బెల్లం అభిలాష్‌కు ఇచ్చినట్లు చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న బెల్లం అభిలాష్.. 'నెక్లెస్ నాకు ఎప్పుడు ఇచ్చావ్..? పోలీసులకు నా పేరు ఎందుకు చెప్పావ్..?' అంటూ, దామళ్ల సందీప్‌ను బెదిరించాడు. ఈ నేపథ్యంలో, తిరుమలాయపాలెంలోని తెలంగాణ ఏజెన్సీలో సందీప్ గడ్డి మందు కొని, సొసైటీ కార్యాలయం వెనుక ప్రాంతానికి వెళ్లి అక్కడ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పాడు. వారు అతడిని వెంటనే ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తన కుమారుడి ఆత్మహత్యాయత్నానికి బెల్లం అభిలాష్ బెదిరింపే కారణమని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌లో సందీప్ తండ్రి తిరుపయ్య ఫిర్యాదు చేశాడు. బెల్లం లభిలాష్‌పై కేసు నమోదైంది. ఎస్ఐ జగదీష్ దర్యాప్తు చేస్తున్నారు.